***గదిలో*** అగరొత్తులు పెట్టటానికి వెళ్ళిన ముసలి నౌకరు గొంతులోంచి కీచుమని సన్నటి ధ్వని బయల్వెడలింది.

దారాలతో, పందిరి మంచం చుట్టూ కట్టిన మల్లెపూల వరుసల వెనుగ్గా! తెల్లటి పక్క మీద- ఒక పిల్లి చచ్చిపడివుంది. దుప్పటి మీద రక్తం చిందింది. ప్రాణం పోయే ముందు చాలా సేపు కొట్టుకున్నట్టు దుప్పటి చెదిరి వుంది.

రెండు నిమిషాల్లో నలుగురూ అక్కడకి చేరారు.

పాల కోసం బల్ల ఎక్కిన పిల్లి గ్లాసు పడేసింది. పగిలిన గ్లాసు మీద కాలు జారి పడటంతో గాజుముక్క మెడలో దిగిపోయింది. అక్కణ్నుంచి మరణ యాతనతో అది గెంతుతూ పక్కమీద చివరి శ్వాస వదిలింది.

అందరికన్నా ముందు తేరుకున్నది భవానీశంకరం. వెంట వెంటనే నౌకర్లకు ఆజ్ఞలు జారీ చేశాడు. దుప్పటి మార్చమనీ, పరుపు మార్చమనీ!. . . . ఇంతలో పెళ్ళి చేసిన పురోహితుడు ఆయన దగ్గరగా వెళ్ళి ఒకసారి యిలా వస్తారా'' అని పక్కకి తీసుకువెళ్ళాడు.

‘‘ఇది అపశకునం. ఇప్పుడొద్దు.''

‘‘గది మార్చమంటారా?''

‘‘గదే కాదు. సమయం కూడా ఇది వద్దు. మరో నాలుగు రోజుల తరువాత చూసుకుందాం.''

ఆయన ఆందోళనగా, ‘‘ఇది అంత అపశకున మంటారా?'' అని అడిగాడు.

‘‘ఎందుకైనా మంచిదని చెపుతున్నాను.''

‘‘కానీ గౌరికి ఈ విషయం ఎలా చెపుతాం? ఈ విషయం తనకి తెలియటం నాకు ఇష్టంలేదు.''

‘‘ఆ సంగతి నేను చూసుకుంటాను మామయ్యా.'' పక్కనుంచి నిలబడిన మాటలకి ఇద్దరూ అటు చూశారు. రాకేష్ వున్నాడక్కడ ‘‘విషయం చెప్పకుండా గౌరిని వప్పించే బాధ్యత నాకు వదిలిపెట్టు-'' అని. అతడు కేదారగౌరి దగ్గిరకు వెళ్ళాడు.

‘‘నేను నీకు ప్రజంటేషను ఏమీ ఇవ్వలేదు. ఆ విషయం అడగవేం?''

‘‘ప్రజంటేష నేమిటి?''

‘‘వివాహ సందర్భంలో బహుమతి.''

‘‘నువ్వు నా కివ్వటం ఏమిటి?''

‘‘అవునే అంత డబ్బు నా దగ్గిరేది?''

ఆమె నొచ్చుకుంటూ "ఛా, నా ఉద్దేశ్యం అదికాదు బావా. అయినా బహుమతి ఏదీ అని అడిగి తీసుకుంటారా ఏమిటి ఎవరైనా" అంది విషయాన్ని తేలిక పరుస్తూ.

అతడు దగ్గిరగా వెళ్ళి "నాకో ఆలోచన వచ్చింది" అన్నాడు.

ఆమె ఏమిటన్నట్టు చూసింది.

"నేనా స్టూడెంట్‌ని. తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తి ఏమీలేదు. మావయ్యని అడిగితే ఇస్తాడు. నీ కూతురి పెళ్ళికి ఏదైనా ఇవ్వాలి; కాస్త డబ్బు సర్దు మావయ్యా! అంటే బావోదు, నేనే సంపాదించాలి. ఎలా. . . . అందుకే ఆలోచించసాగాను. మీ వివాహం జరుగుతున్నప్పుడు నాకు హఠాత్తుగా ఆలోచన వచ్చింది."

ఆమె నవ్వి "ఏమిటి బావా అది" అడిగింది.

"డబ్బు అయితే సంపాదించలేను గానీ, కష్టపడగలను కదా. మీ మొదటి రాత్రి నేనే అరేంజి చేస్తే ఎలా వుంటుంది? ఐమీన్. . . . నేనే పూలు కోసి వగైరా. . . ."

ఆమె మొహం ఎర్రబడింది.

"మావయ్య ముందు మిమ్మల్ని సిమ్లా పంపిద్దామనుకున్నాడు. అంతకన్నా మన తోట బావుంటుందన్నాను. ఆగు- వెళ్ళిపోకు. . . . ఇప్పుడు నీ పెళ్ళికి ప్రజంటేషన్‌గా స్వీకరించు. పోతే నాకు నాలుగురోజులు టైమివ్వు. అన్ని ఏర్పాట్లూ అయిన తరువాత ఇప్పుడు వాయిదా వేశామంటే తన కూతురు ఏమనుకుంటుందో అని మావయ్య. . . ."

"ఛా- పో బావా."

"అయితే నీ కిష్టమేగా?"

ఏమీ సమాధానం చెప్పలేక ఆమె తల తిప్పుకుంది సిగ్గుతో.

"థాంక్యూ" అని అతడు వెళ్ళిపోయాడు.

***ఆమె కళ్ళు ఆర్ద్రమయ్యాయి. తను పెళ్ళి చేసుకోకపోయినా తనమీద అతడి అభిమానం నశించనందుకు. నేను డబ్బుతో ఏమీ కొని ఇవ్వలేను. నాల్రోజులు టైమివ్వు. తోటలో మీ మొదటి రాత్రి స్వయంగా నా చేతుల్తో ఏర్పాటు చేసి, అలంకరిస్తాను.***

అతడు వెళ్ళిన వైపే చూస్తూ "ఎంత మంచివాడివి నువ్వు" అనుకుంది.

రాకేష్ వెళ్ళేసరికి భవానీశంకరం వాళ్ళు అక్కడే వున్నారు.

"చెప్పాను, నవ్వుకుంది" అన్నాడు.

ఆయన తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

"కానీ నాల్రోజుల తరువాత ఇక్కడ కాదు. మన తోటలో అరేంజి చేస్తామన్నాను"

అన్నాడు సమస్య సులభంగా తేలిపోయిన ఆనందంతో. దాన్ని పట్టించుకోకుండా "దానికేముంది. . . ." అంతూ బయటకు నడిచాడాయన. వెనుకే రాకేష్, మిగతా వాళ్ళూ వెళ్ళిపోయారు.

సిద్ధార్థ ఒక్కడే మిగిలాడు.

ఒకసారి పరిశీలనగా బల్లవైపు చూశాడు.

పిల్లి. . . . ఎటువంటి జాగాలోనైనా అవలీలగా నడవగలిగే జంతువు. . . . కేవలం పాల మీద కాలేసి పడటం. . . అందులోనూ అది పడగానే మెడలో గాజు గుచ్చుకోవటం- అది నేలమీద నుంచి ఎగిరి పక్కమీదకు దూకటం. . . . అక్కడ చావడం. . . .

అంతా ఎందుకో ఎక్కడో నమ్మశక్యం కానటువంటి ఫీలింగ్‌ని కలగచేసింది.

* * * *

కారు వచ్చి తోటలో ఆగింది.

సిద్ధార్థ దిగాడు. పక్కనే కేదారగౌరి!

రాకేష్ కారు స్విచ్ ఆపలేదు. "గుడ్ నైట్. . . ." అన్నాడు. "--అండ్ ఆల్ ది బెస్ట్."

దుమ్ము రేపుకుంటూ కారు వెళ్ళిపోయింది. వాళ్ళిద్దరే మిగిలారు. అంత హఠాత్తుగా ఇద్దరే మిగిలిపోవటం ఇద్దరికీ వెంటనే ఏం మాట్లాడాలో తోచలేదు. గౌరి కయితే, అంత ఆరుబయట తోటలోనూ నుదుటన చెమటలు పోస్తున్నాయి. ఆమె స్థితి గమనించాడు సిద్ధార్థ. "కొంచెంసేపు లోపల కూర్చుందామా" అని అడిగాడు. ఆమె స్పష్టంగా తలూపింది.

పంప్ రూమ్ పక్కనే మరొక గెస్ట్‌రూమ్ లాటిది వుంది. ఇద్దరూ మెట్లెక్కారు. దానికి తాళం వేసి వుంది.

ఇద్దరూ అప్రయత్నంగా మొహమొహాలు చూసుకున్నారు.

***రాకేష్ దాని తాళం ఇవ్వటం మర్చిపోయాడు.***

విసుగ్గా సిద్ధార్థ మెట్లు దిగాడు. కేదారగౌరి అతడిని అనుసరించింది పంప్‌రూమ్ పక్కనే చిన్న నీటి కాలువ వుంది. దాన్ని దాటి ఇద్దరూ వెనుకవైపు వచ్చారు. అక్కడ దృశ్యం చూసి వాళ్ళు విస్మయంతో నోట మాటరాక కొన్ని క్షణాలపాటు అలానే వుండిపోయారు.

భూమికి రెండు అడుగుల ఎత్తుగా ఒక మంచెలాటిది వుంది. అన్నీ పూలే. సంబానికీ, అంచులకీ, మధ్యలోనూ, చుట్టూ బోర్డరు- రకరకాల రంగులలో, బంతి,

చామంతి, మల్లె, సన్నజాజి, ఆ ఋతువుల్లో దొరికేవీ, దొరకనివీ, ఎక్కడెక్కడినుంచో తెప్పించినవి. . . .

అసలా దృశ్యమే ఎంతో మనోహరంగా వుంది.

చిరుగాలి తెమ్మెరకి గులాబిపూలు కదులుతున్నాయి. రేకులు అలవోకగా ఎగిరి క్రిందికి రాలుతున్నాయి. పక్క మధ్యలో హార్ట్‌షేపు అమర్చిన మల్లెపూల మీదనుంచి వచ్చే గాలి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తోంది.

అప్పటివరకు వున్న విసుగుని ఎవరో చేత్తో తీసేసినట్టు పోగా, సిద్దార్థ చిరునవ్వుతో గౌరివైపు చూశాడు. ఆ ఆర్చి అందాలని కళ్ళప్పగించి చూస్తూన్న గౌరి, అతడి చూపులోని వేరే అర్థాన్ని గమనించి సిగ్గుతో తల వంచుకుంది. సిద్దార్థ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఒక అనిర్వచనీయమైన భావం ఆమె వళ్ళంతా పాకింది. అది పూర్తిగా సిగ్గు కూడా కాదు. కోర్కె కూడా కాదు. కుర్రవాళ్ళలో కోర్కె బాంబ్‌లాగా బ్లాస్ట్ అవుతుంది. అమ్మాయిల్లో కోర్కె పురుషుడు నిద్ర లేపేవరకూ అలాగే వుండిపోతుంది. కానీ ప్రస్తుతం వీటన్నిటికన్నా అతీతమైన ఫీలింగ్ ఆ క్షణం ఆమెకి కలిగింది. మిగతా ఎవరైనా అయితే ఆ క్షణం అయోమయంలో ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. జరిగినదేదీ గుర్తులేనంత కొత్తదనంతో మైకంలో పడిపోయేవారు. కానీ ఆమె ఆ అనుభూతి తాలూకు ప్రతీ క్షణాన్నీ పూర్తిగా ఆస్వాదిస్తుంది.

అలా ఆమెని తీర్చిదిద్దింది ఆమె తండ్రి.

పద్దెనిమిదో శతాబ్దపు మనిషి ఎక్కువగా 'నమ్మకానికి' ప్రాధాన్యత ఇచ్చాడు. పంతొమ్మిదో శతాబ్దంలో ప్రకృతిని గెలవటానికి ప్రయత్నించాడు. ఇరవయ్యవ శతాబ్దంలో ఒక ప్లానింగ్ పద్దతిలో తన జీవితాన్ని మరింత ఆనందభరితం చేసుకోవటానికి ప్రయత్నిస్తాడు. అలాంటి ప్రయత్నాల్లో 'సెక్స్ ఎడ్యుకేషన్' ఒకటి. పిల్లల్ని, ఆడవాళ్లనీ చీకటి ప్రపంచంలో వుంచి, సెక్స్ గురించి తెలుసుకోకుండా ఆపటంద్వారా నైతిక ధర్మానికి న్యాయం చేకూరుస్తున్నామనే భ్రమలో వున్న పెద్దవాళ్ళు తమ అభిప్రాయం మార్చుకోవటం ద్వారా మానవజాతికి గొప్ప న్యాయం చేకూర్చారు.

మనిషి ఆలోచనలో క్రమక్రమంగా మార్పు రాసాగింది. అలా వచ్చిన మొదటి వరుసలో ఆమె తండ్రి వున్నాడు.

ఏదో వుందన్న కుతూహలం కన్నా, ఇదే వున్నది అన్న విజ్ఞానం 14-20 వయసుకి సాయం చేస్తుంది అని గ్రహించిన మనుష్యులు వాళ్ళు.

ఏ సమాజంలోనైనా మనిషి మరింత ప్రొడక్టివ్‌గా పనిచేయకపోవటానికి కారణం ఆ

మనిషి పార్ట్నర్ నుంచి సరి అయిన ఆనందం రాకపోవటమే అనీ, ఆ పార్ట్నర్ అలా ఆనందం ఇవ్వలేకపోవటానికి కారణం చిన్నతనం నుంచీ ఆ విషయం పట్ల అవగాహన ఎవేర్‌నెస్ లేకపోవటం. ఎపిటైట్ లేకపోవటం, తెలియపర్చకుండా నొక్కిపట్టి వుంచిన పరిస్థితులు. . . . ఇవే అని మనిషి గ్రహించటానికి క్రీస్తు పుట్టాక 1990 సంవత్సరాలు కావల్సి వచ్చాయి.

అవగాహన లేక 12-16 మధ్య వయసులో తామెంత బాధపడ్డారో, ఆ వయసు దాటాక ఈ పెద్దవాళ్ళు మర్చిపోతారు. తమ కొడుకులూ, కూతుళ్ళూ ఈ 'స్టేజి' లోంచి నడిచి తమంతట తామే బయటకు రావాలని ఆశిస్తారు. ఇదంతా ప్రకృతి సిద్ధమనీ ప్రకృతే నేర్పుతుందనీ భావిస్తారు. తాము చెప్పకపోతే ఈ చిన్నవాళ్ళు, ఇంకోలాగెలాగో దీన్ని తెలుసుకుంటారనీ, అది నిశ్చయంగా ఎక్కువ హానికరమనీ గ్రహించారు. తెలియటంకన్నా 'తెలియకపోవటం' వల్లనే పిల్లల ఆలోచన్లు ఎక్కువ ఆ విషయం చుట్టూ పరిభ్రమిస్తాయని ఆలోచించరు. *

భవానీశంకరానికి సరీగ్గా ఇదే సమస్య కొన్నేళ్ళ క్రితం వచ్చింది. **

_____________________________________________________________________________________

* As far sex education goes, I see two main difficulties. First, sexuality is more thanpure biology and less than pure spirituality, but a unique combination of both. Ethics, Aesthetics and religion must come under consideration and sex education must fit sex into the whole pattern of our life. Can this be done? How? By whom?

-- The road to Maturity by E.F.Griffith

** The wave of inquisitiveness swamps the child at the age of 9-13. He wants to know how things are made; stars, watches, babies etc. There are two questions linked up together- when to tell and what

to tell! When a little girl for the first time sees the organ of her younger brother, it is very natural that shi should ask what this little strange thing is! But this is by no means a sexual question, but rather a scientific question. What to tell, and where to stop depends on the age of the child.

--Oswald schwarz on Sex Education.

కేదారగౌరి సైన్సు పుస్తకంలో ఒకచోట ఇంగ్లీషులో ఇలా వుంది: "స్వపరాగ సంపర్కం కేవలం వృక్షజాతిలోనే సంభవం. మనుష్యుల్లో కాదు. . . ." అని తరువాత దాని తాలూకూ వివరణ వుంది.

ఏవైనా అనుమానాలు వస్తే ఆమెకి తండ్రిని అడగటం అలవాటు.

ఆయన ఒక క్షణం కూతురివైపు సాలోచనగా చూశాడు.

సమయం వచ్చింది. చెప్పే వయసు వచ్చింది అనుకున్నాడు.

మెన్‌స్ట్రుయేషన్ సైకిల్స్ గురించీ, ఓవమ్ ఫార్మేషన్ గురించీ వివరించి చెప్పి, "Do you know the basic difference between a man and a woman baby" అని అడిగాడు.

ఆమె కొంచెం తటపటాయించి తెలుసన్నట్టు తలూపింది.

"నేనిప్పుడు పురుషుడి ఫిజియాలజీ గురించి చెపుతాను" అని ఆగాడు. ". . . . పదిహేను, పదహారు ఏళ్ళు దాటిన పురుషుడికి స్త్రీ గురించిన ఆలోచన వచ్చినపుడు అతడి శరీరంలో కొంచెం సేపు ఒక చిన్న మార్పు వస్తుందమ్మా. . . . ఆ మార్పు కొద్ది నిమిషాలపాటు వుంటుంది. తర్వాత మామూలుగా అయిపోతాడు. మెదడులో స్త్రీ పరమైన ఆలోచన రాగానే పురుషుడి శరీరంలో రక్త ప్రసరణం హెచ్చుతుంది ముఖ్యంగా జెనిటల్ ఆర్గన్‌లో. . . . ఎల్లప్పుడూ మామూలుగా వుండే ఈ అవయవం ఇలా కొద్దిసేపు పాటు గట్టిపడటాన్ని ఇంగ్లీషులో 'ఎరక్షన్' అంటారు. కొన్ని పదాలు తెలుగులో మాట్లాడానికి బాగోవు. ఇంగ్లీషులో నీకు అర్థమవుతుంది కదా. . . ."

ఆమె తలూపింది. తన తండ్రి మొహంలోకి చూడడానికి సిగ్గు పడాలేమో అనుకుంది కానీ చిత్రంగా అటువంటి భావమేమీ కలగలేదు.

"అలా ఎరక్ట్ అయిన తన అవయువాన్ని పురుషుడు స్త్రీ వెజీనాలోకి 'ఇన్‌సర్ట్'

చేయటాన్ని, ఇందాక నువ్వు అన్నావే సంపర్కం అని- అదే ఇంగ్లీషులో మేటింగ్ అంటారు. పురుషుడికి స్త్రీకి వేర్వేరు అవయవాలున్నాయి కాబట్టి మనుష్యుల్లో స్వపరాగ సంపర్కం సాధ్యంకాదు. పోతే ఈ మేటింగ్‌కి క్లైమాక్స్ అనేది మూడు నాలుగు నిమిషాలుంటుంది. సృష్టిలో ఇంకో గొప్ప అద్భుతమైన శారీరక నిర్మాణం ఏమిటంటే మామూలు సమయాల్లో యూరిన్‌ని బహిర్గతపరిచే పురుషుడి అవయవం- ఈ క్లైమాక్స్ పూర్తయిన సమయంలో ఒక ద్రవాన్ని విడుదల చేస్తుంది. విడుదల చేయగానే మళ్ళీ మామూలుగా అయిపోతుందనుకో. . . . అది వేరే సంగతి--! పోతే ఆ ద్రవమే స్పెర్మ్!" అతడు ఆగాడు.

"ఒక చుక్క స్పెర్మ్‌లో అసంఖ్యాకమైన శుక్లకణాలుంటాయి. వీటిలో ఏ ఒక్కటయినా సరే, స్త్రీలో వుండే అండాన్ని సరైన సమయంలో చేరుకుంటే అప్పుడు స్త్రీ గర్భాన్ని దాలుస్తుంది. ఒక్కొక్క కణంలో 23 క్రోమోజోములుంటాయి. అలాగే స్త్రీ అండంలో మరో 23 క్రోమోజోములుంటాయి. రెండు కలసి 23 'జతలుగా' మారటమే సృష్టి" ఆయన నవ్వేడు. "--ఎప్పుడో చదివిన చదువు ఇది. ఆ తరువాత పూర్తిగా మర్చిపోయాననుకో. కానీ జెనెటిక్ ఇంజనీరింగ్ చాలా మంచి సబ్జెక్టు. దీనికి సంబధించిన రహస్యాలు ఇంకా చాలా బయట పడాలి. నువ్వుగానీ ఈ సబ్జెక్టు చదివితే తప్పకుండా రీసెర్చి చేయి. ఏమో ఎవరు చూడొచ్చారు. నీ ద్వారానే ఒక కొత్త విషయం బయట పడవచ్చు--"

ఆమె చదవలేదు. వ్యవసాయానికి సంబంధించిన శాస్త్రం చదివింది. అదీ పట్టభద్రురాలయ్యే వరకే. తర్వాత ఆమె గృహిణి అయింది. అదంతా తరువాతి సంగతి. . . . అప్పుడు మాత్రం ఆమె చిన్ని ప్రపంచంలో ఒక కొత్త ద్వారం విచ్చుకున్నట్టయింది. అప్పటివరకూ అలాంటిది ఒకటుందని తెలియని స్థితి.

ఎందుకో ఆమెకి తన తల్లి గుర్తొచ్చింది. అంతా విన్నాక ఆమె ఒకటే అనుకుంది. ఈ విషయాలు 'తన తల్లి చెబితే ఎంత బావుణ్ణు' ఈ సూడో సభ్యతా సమాజంలో తల్లి కూడా ఈ విషయాలు చెప్పదని ఆమెకి తెలీదు.

"నాన్నా."

"ఏమిటమ్మా?"

"Are you canvassing for sex education?"

"కొన్ని ప్రాథమిక విషయాలు సరి అయిన వ్యక్తి ద్వారా, సరి అయిన రీతిలో సవ్యమయిన మనిషి ద్వారా తెలుసుకోవటం చాలా అవసరమమ్మా. ఈ దౌర్భాగ్యపు